కఠిన చట్టాలు తీసుకురావాలి



కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థినిపై అగంతుకులు అత్యాచారం చేసి చంపివేయటం మనస్సును కలచివేసే విషయం. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ లేకపోవటం బాధాకరం. ప్రభుత్వాలు కఠిన చట్టాలు రూపొందించి అమలు చేయకపోతే భవిష్యత్‌లో నిర్భయంగా విధులు నిర్వర్తించలేం. మహిళలకు ధైర్యం నిచ్చేలా, తప్పు చేయాలంటే అగంతకుల గుండెల్లో భయంపుట్టేలా ప్రభుత్వాలు చట్టాలు చేయాలి. చేసిన చట్టాలను కఠినంగా అమలు చేస్తేనే మహిళలకు సమాజంలో భరోసా ఉంటుంది.

– కె.లిల్లీ, స్టాఫ్‌నర్స్, నగరం ప్రాథమిక వైద్యశాల



కఠిన చర్యలు తీసుకోవాలి



వైద్యులపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రత పరమైన అంశాలపై దృష్టి పెట్టాలి. వైద్యశాలల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రస్తుతం పట్టణాల్లో ఉన్న ఆస్పత్రుల వద్ద మాత్రమే కొద్దిపాటి భద్రత చర్యలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అసలే లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి తగిన భద్రత ఏర్పాట్లు చేయాలి. ఇప్పటి కోల్‌కతా ఘటనతో మానసిక ఆందోళన మొదలైంది. తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి.

– ఫరీనాబేగం, వైద్యురాలు, నుదురుపాడు

క్లుప్తంగా

రూరల్ సీఐగా సురేష్‌బాబు



రేపల్లె రూరల్: రూరల్ సీఐగా ఆర్.సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగం నుంచి బదిలీపై రేపల్లె విచ్చేశారు. ఇప్పటి వరకు రూరల్ సీఐగా విధులు నిర్వర్తించిన మల్లికార్జునరావు రేపల్లె పట్టణ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన సురేష్ బాబుకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

సేంద్రియ సాగు పొలాల పరిశీలన



పిట్టలవానిపాలెం: మండల పరిధిలోని గోకరాజు నల్లిబోయిన వారిపాలెం గ్రామ శివారులోని దివాన్‌తోట సమీపంలో 12 ఎకరాల విస్తీర్ణంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పొలాన్ని పరిశీలించేందుకు జిల్లాలోని పలు మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు తరలివచ్చారు. ప్రధానంగా సేంద్రియ వ్యవసాయ బాపట్ల జిల్లా ప్రాజెక్టు అధికారిణి వాణిశ్రీ, డీడీఏ విజయ నిర్మల, బాపట్ల ఏడీఏ లక్ష్మి, వ్యవసాయాధికారులు సత్యానంద్, సునీత, శారద ఏఈఓలు పావని, సుదర్శనరావులతో పాటు సుమారు 50 మందికి పైగా అధికారులు సిబ్బంది పొలాలను పరిశీలించారు.

వేమూరు రూరల్ సీఐగా..



వేమూరు: రూరల్ సీఐగా పి.వి.ఆంజనేయులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ పసుపులేటి రామకృష్ణ బదిలీపై నరసరావుపేట రూరల్‌కు వెళ్లారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో విధులు నిర్వర్తించిన ఆంజనేయులు ఇక్కడికి వచ్చారు. ఆయనకు ఎస్‌ఐ రవికృష్ణ, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

అడవులదీవి ఎస్‌ఐగా రవి శంకర్ రెడ్డి



నిజాంపట్నం: శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అడవులదీవి ఎస్‌ఐ వి.రవిశంకర్ రెడ్డి తెలిపారు. అడవులదీవి ఎస్‌ఐగా బుధవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల అడవులదీవి ఎస్‌ఐ వెంకట రవి బదిలీపై దుగ్గిరాల వెళ్లారు. ఎస్‌ఐ రవి శంకర్ రెడ్డి వీఆర్ నుంచి బదిలీపై అడవులదీవి పోలీస్ స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట వంటి జూదాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

మురుగు కాల్వల నిర్మాణానికి వినతి



అనంతవరం (కొల్లూరు): మండలంలోని అనంతవరంలో మురుగు కాల్వ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడి లైబ్రరీ పక్క బజారులో సమస్యపై పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. ఇళ్లలో నుంచి వ్యర్థ నీరు రోడ్డుపైకి చేరుతుండటంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన చుండూరు ఎస్‌ఐ



వేమూరు (చుండూరు): చుండూరు ఎస్‌ఐగా కె. సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఆయన ఇటీవల బదిలీలలో ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

పీవీపాలెంలో నేడు జాతీయ క్రీడా దినోత్సవం

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఈనెల 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పాఠశాల వ్యాయామోపాధ్యాయులు ప్రశాంత్‌బాబు తెలిపారు. భారత హాకీ క్రీడాకారుడైన ధ్యాన్‌చంద్ గౌరవ సూచకంగా ఆయన పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు క్రీడలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించడం జరుగుతుందని తెలిపారు.

విష జ్వరాల విజృంభణ..!

ఏ ఊరిలో చూసినా ప్రజలు విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. చాలాచోట్ల డెంగీ కేసులు ఎక్కువ అవుతుండటంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులకుతోడు పారిశుద్ధ్యం లోపించడం వారి పాలిట శాపంగా మారింది. వైద్యశాలలు, మందుల దుకాణాల్లో కూడా జ్వర బాధితులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. రూ.వేలకు వేలు ఖర్చు చేయాల్సి రావడంతో మధ్యతరగతి వారు, పేదలు ఆర్థికంగా కుదేలు అవుతున్నారు.



కొల్లూరులోని ఓ ప్రయివేటు క్లినిక్‌లో సెలైన్లు పెట్టించుకోవడానికి క్యూలో జ్వర బాధితులు



కొల్లూరులో ఓ మెడికల్ దుకాణం వద్ద రద్దీ

- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- రూ.వేల ఖర్చుతో సామాన్యుల బెంబేలు

కొల్లూరు: వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలం తాతావారిపాలెం గ్రామం మొత్తం ఇటీవల జ్వరాలు వ్యాపించాయి. ఆ ఒక్క గ్రామం నుంచే తెనాలి, గుంటూరు, రేపల్లె, చెరుకుపల్లి ప్రాంతాల్లోని వైద్యశాలలకు ప్రజలు భారీ సంఖ్యలో వెళ్తున్నారు. జ్వరాల విజృంభణకు ఇదే నిదర్శనంగా నిలుస్తోంది. అమృతలూరు మండలంలోని ప్యాపర్రులో డెంగీ లక్షణాలతో ఓ విద్యార్థిని మృతి చెందింది.



కొల్లూరులో ఓ ప్రయివేటు క్లినిక్ వద్ద వైద్య సేవలకోసం ఎదురుచూస్తున్న జ్వర పీడితులు



కొల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో మందుల కోసం రోగుల అవస్థలు

ఆస్పత్రుల వద్ద పడిగాపులు

జ్వర పీడితుల సంఖ్య లెక్కకు మించి ఉండటంతో వైద్యశాలల వద్ద పడిగాపులు తప్పడం లేదు. ప్రభుత్వ, ప్రయివేటు వైద్యశాలలతో పాటు ఆర్‌ఎంపీలు, పీఎంపీల వద్ద కూడా తమ వంతు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి రోగులకు ఎదురవుతోంది. కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, చుండూరు మండలాల నుంచి రోజుకు వందల సంఖ్యలో ఆయా మండల కేంద్రాల్లోని ఆస్పత్రులకు వస్తున్నారు. తెనాలి, గుంటూరు, విజయవాడ వంటి ప్రాంతాల్లోని కార్పొరేట్ వైద్యశాలలకు కూడా వెళ్తున్నారు. దీన్ని అవకాశంగా తీసుకుంటున్న కొందరు నిర్వాహకులు రూ. వేలకు వేలు బిల్లులు వసూలు చేస్తుండటంతో ప్రజలు ఆర్థికంగానూ చితికిపోతున్నారు. గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించే విషయంలో వైద్య, ఆరోగ్య శాఖ విఫలమైంది. పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణలో యంత్రాంగం నిర్లక్ష్యం కనిపిస్తోంది.

ఖాళీ అవుతున్న జేబులు



జ్వరం వచ్చి రోజులు గడుస్తున్నా తగ్గకపోవడంతో చికిత్స చేయించుకోవడానికి రూ. వేలల్లో ఖర్చు చేస్తున్నా. ఒకరికి జ్వరం వస్తే కుటుంబంలోని మిగిలిన వారికి కూడా వస్తోంది. సాధారణ జ్వరాలు తగ్గడానికి కూడా ఒక్కొక్కరికి సుమారు రూ. 10 వేల వరకు వెచ్చించాల్సిన పరిస్థితితో ఇబ్బంది పడుతున్నాం.

– వెలివల కోటేశ్వరరావు, కుచ్చళ్లపాడు, వేమూరు మండలం

నీరసం తగ్గడం లేదు



జ్వరం బారిన పడ్డా. ఒళ్లు నొప్పులతోపాటు రోజుల తరబడి నీరసంగా ఉంటోంది. మంచానికే పరిమితం అయ్యా. చికిత్స తీసుకోవాలన్నా వైద్యశాలల్లో ఖాళీ లేదు. రోజూ సెలైన్లు, ఇతర మందులు వాడా. వారం రోజుల తర్వాత కూడా నొప్పులు, నీరసం వేధిస్తున్నాయి. ఏ పనులూ చేసుకోలేక ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది.

– మట్టా భార్గవి, కొల్లూరు

మందులు కొనడానికే గంటల సమయం



జ్వరంతో బాధపడుతుంటే మందులు షాపుల వద్ద ఔషధాల కొనుగోలుకు కూడా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. కళ్లు తిరిగి పడిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వైద్యశాలల్లో చికిత్స తీసుకోవాలన్నా నా వంతు కోసం గంటలకు గంటలు ఎదురుచూడాల్సిన దుస్థితి.

– వాకా ఫణి, కొల్లూరు

అమరవీరులకు రుణపడి ఉండాలి

రేపల్లె రూరల్: ప్రజల కోసం పోరాటాలలో పాల్గొని తమ ప్రాణాలను త్యాగం చేసిన విప్లవ వీరులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని సీపీఎం పట్టణ కార్యదర్శి సి.హెచ్.మణిలాల్ అన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ సమస్యలపై పోరాడి పోలీసుల కాల్పుల్లో అశువులుబాసిన అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలకు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1991 నూతన ఆర్థిక సంస్కరణలు ఆంధ్రరాష్ట్రంలో అమలు చేసే విధానంలో భాగంగా 2000సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సుమారు రూ.1000కోట్ల మేర విద్యుత్ చార్జీలు ప్రజలుపై భారం మోపినప్పుడు వామపక్ష పార్టీలు మూడునెలలు పాటు అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహించాయన్నారు. చలో హైదరాబాద్ నిర్వహిస్తే అప్పటి రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన పోలీసు కాల్పుల్లో వందలాది మంది గాయాలుపాలయ్యారని, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలు ప్రాణాలు కోల్పోయారన్నారు. వీరి త్యాగాలు వృథాకాలేదని, ఫలితంగా రాష్ట్రంలో ఏడు ఏళ్ల పాటు విద్యుత్ చార్జీలు పెంచలేదన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీలు పెంచినా చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ రాష్ట్రంలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టే విషయంలో అత్యుత్సాహం చూపిస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నూతన విద్యుత్ పాలసీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రాయితీలను సైతం ప్రజలకు అందకుండా అని రకాల విద్యుత్ చార్జీలు పెంచాలని సంస్కరణలు, అమలు చేయలని నూతన విద్యుత్ పాలసీ అమలకు పూనుకోవటం, ఆ విధానాలను నేడు ఆంధ్రరాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేయాలనుకోవడంతో ప్రజలపై పెద్ద మొత్తంలో భారం పడుతోందని అన్నారు.



అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ చార్జీల భారాలుపై ప్రజలందరినీ కలుపుకుని మరో ఉద్యమానికి సిద్ధమవుతామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై. కిషోర్, కేవీ లక్ష్మణరావు, జె.ధర్మరాజు, డి.శ్రీనివాసరావు, యు.రామకృష్ణ, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు అమరవీరులను స్మరించుకోవాలి

బాపట్ల: ప్రతి కార్మికులు అమరవీరులను స్మరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్ పేర్కొన్నారు. 2000 సంవత్సరంలో బషీరాబాద్‌లో కాల్పుల్లో మృతి చెందిన అమరవీరుల సంస్మరణ సభ స్థానిక పాతబస్టాండ్ వద్ద బుధవారం జరిగింది. నాడు చంద్రబాబునాయుడు ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి బషీరాబాద్‌లో చేపట్టిన నిరసనకారులపై కాల్పులు జరిపి పొట్టన బెట్టుకున్నారని మజుందార్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకు షరతులకు లొంగి స్మార్ట్ మీటర్లు బిగించడానికి రంగం సిద్ధం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బుచ్చిరాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న మజుందార్

త్వరలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై వ్యతిరేక ఉద్యమం

బాపట్లటౌన్: కరెంట్ చార్జీలు తగ్గించమని అడిగిన నేరానికి రైతులపై బషీరాబాద్‌లో కాల్పులు జరిపి ముగ్గురు ప్రాణాలను బలిగొన్న ఘనుడు చంద్రబాబు అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ తెలిపారు. బషీరాబాద్ ఘటన ఆగస్టు 28, 2000 సంవత్సరంలో జరిగిందన్నారు. ఇప్పటికీ సరిగ్గా 24 ఏళ్ల అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బషీరాబాద్‌లో అమరులైన అమరవీరు చిత్రపటానికి బుధవారం పూలమాలలేసి నివాళులర్పించారు. మజుందార్ మాట్లాడుతూ తాజాగా స్మార్ట్ మీటర్ల ముసుగులో రైతులపై పెనుభారాన్ని మోపేందుకు సిద్ధమవుతున్నారన్నారు.

స్మార్ట్ మీటర్ల వల్ల వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. వినియోగదారులు కూడా ముందుగా రీఛార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని, అమరవీరుల త్యాగాలతో విద్యుత్ స్మార్ట్ మీటర్స్‌పై వ్యతిరేకంగా రాబోయే కాలంలో పోరాటం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరాజు, కిషోర్, నాయకులు పాల్గొన్నారు

ప్రయివేటు క్లినిక్‌లో నగదు చోరీ

కొల్లూరు: ఓ ప్రయివేటు క్లినిక్‌లో నగదు చోరీ జరిగింది. స్థానికులు, క్లినిక్ నిర్వాహకుల సమాచారం మేరకు.. కొల్లూరు స్టేట్‌బ్యాంక్ రోడ్డులోని శ్రీసాయి వెంకటేశ్వర ప్రశాంత్ క్లినిక్‌కు మంగళవారం రాత్రి తాళాలు వేసిన నిర్వాహకులు ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి క్లినిక్ వెనుక భాగం నుంచి దుండగుడు లోపలికి ప్రవేశించాడు. టేబుల్ సొరుగులోని నగదు దొంగిలించాడు. ఈ దృశ్యం సీసీ కెమెరాలలో నిక్షిప్తమైంది. సుమారు రూ. 60 వేలకు పైగా నగదు చోరీ జరిగినట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని, అందితే దర్యాప్తు చేస్తామని కొల్లూరు పోలీసులు తెలిపారు.



సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

● 'పిచ్చి' తొలగించారు!

మండలంలోని మోళ్లగుంట కట్టవ గ్రామంలో తుఫాను షెల్టర్‌లో ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి బూత్ బంగ్లాగా తయారైన వైనంపై చిట్టడవిలా తుఫాను షెల్టర్ శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. జేసీబీతో తుఫాను షెల్టర్ ప్రాంగణంలో దట్టంగా పెరిగిన ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలను వెంటనే తొలగించి శుభ్రపరిచారు. దీంతో గ్రామస్తులు సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.



సాక్షి ఎఫెక్ట్

–రేపల్లె రూరల్

కర్లపాలెంలో తప్పిన ప్రమాదం

- పెచ్చులూడి పడిన వెంకట ఉదయలక్ష్మీ టవర్స్ గోడ
- పరిశీలించిన ఆర్డీవో రవీందర్, డీపీవో రవికుమార్

కర్లపాలెం: మండల కేంద్రం కర్లపాలెం సెంటర్‌లోని ఏట్రవారిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న వెంకట ఉదయలక్ష్మీ టవర్స్ గోడలు శిథిలావస్థకు చేరి మంగళవారం రాత్రి టవర్ ముందు షాపుల వద్ద ఉన్న రేకుల షెడ్డుపై కూలాయి. భవనం శిథిలాలు పడటంతో ముందు ఉన్న రేకుల షెడ్డు ధ్వంసమై ఒరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఉదయలక్ష్మీ టవర్స్ గోడలు శిథిలావస్థకు చేరి రాత్రి సమయంలో రేకుల షెడ్డుపై పడటం ఆ సమయంలో ప్రజలెవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ టవర్స్‌ను 2012 నిర్మించారు. ఐదు అంతస్తులలో ఉన్న ఈ భవనంలో వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, రైతులు లక్షలాది రూపాయలు పోసి ఫ్లాట్స్ కొనుగోలు చేసి సుమారుగా 9 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఈ టవర్స్ నిర్మించేటప్పుడే కొంత భాగం ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉందని ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడి పడటంతో అందులో నివాసం ఉంటున్న వారు భవనం నాణ్యతపై అనుమానాలు ఏర్పడి అభద్రతా భావానికి లోనవుతున్నారు.



గోడ పెచ్చులూడి పడి కూలిన రేకుల షెడ్డు



టవర్స్‌ను పరిశీలించిన ఆర్డీవో రవీందర్, తహసీల్దార్ వెంకటరత్నం

భవనం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలి

వెంకట ఉదయలక్ష్మి టవర్స్ భవనం నాణ్యతా ప్రమాణాలను నిపుణులతో పరిశీలించాల్సి ఉందని బాపట్ల ఆర్డీవో జి.రవీందర్, డీపీవో రవికుమార్‌లు అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం ఆర్డీవో, డీపీవో తహసీల్దార్ వెంకటరత్నంతో కలసి టవర్స్‌ను పరిశీలించారు. నిర్వాహకులకు తక్షణమే నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతికి ఆర్డీవో, డీపీవోలు ఆదేశించారు. టవర్స్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని టవర్స్ యజమానులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, డి.పద్మావతి, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బండ్లమ్మ దేవాలయంలో రేపు పూర్ణాహుతి

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో కొలువై ఉన్న బండ్లమ్మ వారి దేవాలయంలో బండ్లమ్మవారి దీక్ష విరమణ కార్యక్రమం ఈనెల 30వ తేదీన జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి తెలిపారు. దీక్ష ఇరుముడి–పూర్ణాహుతి కార్యక్రమాలు ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతాయని తెలిపారు. దీక్ష స్వీకరించిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

రేపు ధ్వజ శిఖర ప్రతిష్ఠా మహోత్సవం

తురుమెళ్ల (వేమూరు): అమర్తలూరు మండలంలోని తురుమెళ్ల గ్రామంలో ఈ నెల 30వ తేదీన శ్రీ పార్వతివర్ధని సమేత శ్రీ విరూపాక్ష స్వామి వారి దేవస్థానంలో ధ్వజ స్తంభ కవచ – ధ్వజ శిఖర ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 10.49 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని ఈవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తాగునీటి ట్యాంకర్ ఏర్పాటు



కర్లపాలెం: సముద్రతీర ప్రాంతాన ఉన్న తుమ్మలపల్లి గ్రామంలో తాగునీటికి ట్యాంకర్ ఏర్పాటు చేసి కొళాయి సౌకర్యం కల్పించటం అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు తెలిపారు. కర్లపాలెం మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామమైన తుమ్మలపల్లిలో పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన దాత షేక్ కాజా ఏర్పాటు చేసిన తాగునీటి వసతి కేంద్రాన్ని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే చింతాయపాలెంలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు చేశారు. అనంతరం బుద్ధాం గ్రామంలో కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ కృష్ణుడి ఆలయం వద్ద పూజల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వై.భూపతిరావు, నాయకులు నక్కల వెంకట స్వామి, కర్రి శ్రీనివాసరావు, బోయిన ముసలయ్య, పులుగు సముద్రాల రెడ్డి, బీజేపీ కరిముల్లా ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచాలి

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



పిట్టలవానిపాలెం: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండల పరిధిలోని గోకరాజునల్లి బోయినవారిపాలెం శివారు దివాన్‌తోట సమీపంలో సేంద్రియ వ్యవసాయం అవలంబిస్తున్న 12 ఎకరాల వరి పొలాన్ని వ్యవసాయశాఖ, సేంద్రియ శాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈప్రాంతంలో వేస్ ఆగ్రో ఫామ్స్ లిమిటెడ్ పేరుతో బయోఉత్పత్తులను తయారు చేసే ఫ్యాక్టరీని స్థాపించి రైతులకు మేలు చేసే విధంగా ముందుకు వచ్చిన వేగేశన జానకిరామరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సేంద్రియ వ్యవసాయ చేసేందుకు ముందుకు వచ్చిన రైతులకు ప్రోత్సాహకాలు ఏమైనా ఉన్నాయా లేదా అనే విషయాలని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వేస్ ఆగ్రో ఫామ్స్ లిమిటెడ్ ఛైర్మన్ వేగేశన జానకిరామరాజు మాట్లాడుతూ ఈ ఏడాది 12 ఎకరాలలో ఎలాంటి రసాయనిక ఎరువులు, రసాయనిక మందులు వినియోగించకుండా సేంద్రియ విధానంలో వరిసాగు చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో వందలాది ఎకరాలలో సేంద్రియ వ్యవసాయం చేసేందుకు లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయం అవలంభించాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేర్ ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్ అండ్ సెక్రెటరీ వేగేశన కిషోర్ కుమార్ సిబ్బంది ఉన్నారు.